

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 10 | శనివారం 11, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

### రాజ్యసభ సభ్యుడిగా

# నితీశ్ ప్రమాణం




న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.

### మంత్రులకు చంద్రబాబు

## సీరియస్

# వార్నింగ్



అమరావతి, ఏప్రిల్ 10 : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన

### ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక

విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు,

2లో

# కాలిన నోట్ల కట్టల వ్యవహారం

### - పదవికి రాజీనామా చేసిన జస్టిస్ యశ్వంత్ వర్మ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఢిల్లీలోనితన నివాసంలో కాలిన నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆయనను తొలగిం చేందుకు అభిశంసన పక్రియకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మార్చి 14న ఢిల్లీ హైకోర్టు జడ్జిగా

2లో

# హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

### - ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం/విజయవాడ, ఏప్రిల్ 10 : హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమాన యాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభిం చింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యు లకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం

2లో

# పడవ బోల్తా..

### తొమ్మిది మంది మృతి



లక్నో, ఏప్రిల్ 10: ఉత్తరప్రదేశ్ మథుర సమీపంలోని యమునా నదిలో యాత్రికులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. పలువురు యాత్రికులు నదిలో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని.. అవి కొనసాగుతున్నాయని జిల్లా మేజిస్ట్రేట్ సీపీ సింగ్ వెల్లడించారు. మథుర సమీపంలో ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఈ పడవ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు.శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు కేసీ ఘాట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. పంజాబ్‌లోని లూథియానా నుంచి రెండు బోట్లలో భక్తులు వస్తున్నారన్నారు. సహాయక చర్యల్లో భాగంగా 17 మందిని రక్షించామన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సమాచారం అందగానే వెంటనే ఘటన స్థలానికి

2లో

# వివాదంలో మోనాలిసా పెళ్లి

- పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు
- భర్తపై ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



లక్నో, ఏప్రిల్10 ఏప్రిల్ 10 : కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కు కుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి

2లో

# మరోమారు షాకిచ్చిన పసిడి ధర

### - ఏకంగా రూ.1,520 పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : పసిడి ప్రియులకు మరోసారి షాకిస్తూ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో

2లో

### నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ

# అమరావతిపై సజ్జల విమర్శలు



అమరావతి, ఏప్రిల్ 10 : ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్య మైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి పరిస్థితి కూడా అలాగే మారుతుందని

2లో

### వైఎస్ఆర్ మృతిపై బొత్స కన్నీరు పెట్టారు కానీ

# జగన్ పాత్రను ఖండించ లేదు: సోమిరెడ్డి



నెల్లూరు, ఏప్రిల్ 10 : ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వీకెండ్ కథనంపై వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం నెల్లూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. వైసీపీ నేతలు కాకాణి గోవర్ధన్ రెడ్డి, అంబటి రాంబాబు, పేర్ని నాని తదితరులు వాడిన భాష కంటే ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ వాడిన భాష పెద్దదేమి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వైసీపీ నేతలు ఉత్తర కొరియా అనుకుంటున్నట్లు ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. మగాళ్లు అయితే రండి అంటూ సవాల్ విసిరిన మాజీ మంత్రి కాకాణి.. చింతామణి లో ఎందుకు దాక్కున్నట్లు అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు.

2లో

# సంపాదకీయం

## మహిళా బిల్లుతో పాటు..సమాజ రుగ్మతలపైనా చర్చించాలి !

భారతదేశం స్వాతంత్య్రం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమి స్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవుతాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోకసభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధినియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది.

## మరోమారు షాకిచ్చిన పసిడి ధర

పసిడి పరుగు కొనసాగుతోంది. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై ఏకంగా రూ.1,520 పెరగడంతో, ప్రస్తుతం రూ.1,53,000 మార్కుకు చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ.1,400 మేర ఎగబాకి, 10 గ్రాముల ధర రూ.1,40,250 వద్ద కొనసాగుతోంది. పసిడితో పాటే వెండి కూడా అదే స్థాయిలో దూసుకుపోతోంది. కిలో వెండి ధరపై ఏకంగా రూ.5,000 పెరగడంతో ప్రస్తుత ధర రూ.2,65,000కి చేరింది. వరుసగా పెరుగుతున్న ఈ ధరలతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

## నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ అమరావతిపై సజ్జల విమర్శలు

ఆయన హెచ్చరించారు. కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు. చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. తన సొంత సంస్థ హెరిటేజ్‌ను నడిపేటప్పుడు తీసుకునే ఆర్థిక జాగ్రత్తలను, రాజధాని నిర్వహణలో చంద్రబాబు ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. అప్పుల ద్వారా వచ్చే నిధులతో ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పలేకపోతున్నారని, ఆయన మాటల్లో డొల్లతనం కనిపిస్తోందని విమర్శించారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ ప్రతిపాదించిన మావిగన్ రాజధాని గురించి సజ్జల ప్రస్తావిస్తూ, అమరావతికి అయ్యే ఖర్చులో కేవలం 10 శాతంతోనే మరుసటి రోజు నుంచే పూర్తిస్థాయి రాజధానిగా మార్చవచ్చని తెలిపారు. మావిగన్ ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే కనెక్టివిటీ, పోర్టుతో అనుసంధానం అయిందని, అక్కడ పెట్టుబడి పెడితే తక్షణమే ఫలితం ఉంటుందని వివరించారు. రాష్ట్ర వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నదే జగన్ ఆలోచన అని, కానీ చంద్రబాబు కేవలం భ్రమలు సృష్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వృథా ఖర్చులను ఆపి, ఆచరణాత్మకమైన రాజధాని వైపు అడుగులు వేయాలని సజ్జల సూచించారు.

## పడవ బోల్తా.. తొమ్మిది మంది మృతి

చేరుకుని సహాయక చర్యలు చేపట్టామని జిల్లా మేజిస్ట్రేట్ సీపీ సింగ్ వెల్లడించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం, జాతీయ విపత్తు స్పందన దళంతోపాటు 50 మంది ఈతగాళ్లు సహాయక చర్యల్లో పాల్గొన్నారని జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. మరోవైపు బలమైన గాలుల కారణంగా నది మధ్యలో ఉన్న పడవ తీవ్రంగా ఊగిపోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో వేగం పెరిగిన పడవ వంతెనను ఢీ కొట్టి బోల్తా పడిందని డీఎం సీపీ సింగ్ తెలిపారు.

## మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

## వివాదంలో మోనాలిసా పెళ్లి

దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## కాలిన నోట్ల కట్టల వ్యవహారం

ఉన్న సమయంలో జస్టిస్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీని ఫలితంగా 2025 జులైలో లోక్‌సభలో 145 మంది, రాజ్యసభలో 63 మంది ఎంపీలు ఆయనపై అభిశంసన తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏర్పాటును జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, ఆయన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. అంతకుముందు సుప్రీంకోర్టు అంతర్గత కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేసినా ఆయనకు చుక్కెదురైన విషయం తెలిసిందే. దీంతో ఇక లాభం లేదనుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

## వైఎస్ఆర్ మృతిపై బొత్స కన్నీరు పెట్టారు కానీ జగన్ పాత్రను ఖండించ లేదు: సోమిరెడ్డి

రామోజీ రావు, రాధాకృష్ణ మీద కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వైసీపీ నేతలపై మండిపడ్డారు. టీడీపీ వాళ్లకి క్రమశిక్షణ ఉందన్నారు. వైసీపీ నేతల లాగా తమకు మాట్లాడడం రాదని చెప్పారు. హైకోర్టు తీర్పు వైసీపీకి చెంపపెట్టు అని ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో రూ.3,500 కోట్లు మద్యం మాఫియా వల్ల 50 వేల మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రేమజంట ఆత్మహత్య

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

పల్నాడు, ఏప్రిల్ 10 : కొండవీడు కోటలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకుపాల్పడిన ఘటన ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. తమ ప్రేమ విహహాన్ని తల్లిదండ్రులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రేమజంట పురుగు మందు తాగి బల వన్మరణానికి పాల్పడింది. ఈసంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతీ, యువకుడు ప్రేమించుకోగా వారి ప్రేమను పెద్దలు నిరాకరిం చారు. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రేమించిన వ్యక్తిని మరిచి పోలేక... భర్తను వదిలేసి ప్రేమికుడి వద్దకు వచ్చేసిందా యువతి. ఇద్దరు కలిసి జీవించాలని అనుకున్నప్పటికీ పెద్దలు తమ వివాహాన్ని అంగీకరించరని భావించిన ప్రేమజంట కఠిన నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న కొండవీడు కోటకు వచ్చిన వీరిద్దరు.. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. వీరిద్దరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 6096 గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి

**- గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యత - ఓ టి పి ద్వారానే డెలివరీ**

**- పట్టణాల్లో 25 రోజులకు బుకింగ్- గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు బుకింగ్ - డి ఎస్ ఓ - ఆర్ .జమీర్ బాషా**



బాపట్ల, ఏప్రిల్ 10 : జిల్లాలో వంట గ్యాస్ కొరతలేదు ప్రజలు ఎవ్వరు కంగారు పడవలసిన అవసరం లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.జమీర్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వంట గ్యాస్ కొరతలేదని ఎవ్వరు కూడా కంగారు పడవలసి అవసరం లేదని,నేటికి జిల్లాలో 6096 గ్యాస్ సిలిండర్లు ప్రజలకుఅందుబాటులోఉన్నాయిని తెలిపారు,మీ సెల్ కు ఓ టి పి వచ్చిన తర్వాత నే గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని గ్యాస్ వినియోగదారుల కు సూచించారు. గ్యాస్ సిలిండర్లు బాయ్స్ వినియోగదారుల నుండి ఎక్కువ మొత్తం డబ్బులు వసూలు చేస్తే వెంటనే జిల్లా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నెం.94932 47765 కు కాల్ చేసి పిర్యాదు చేయాలని ఆయన అప్రకటనలో తెలిపారు.

## రామయపట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు, ఏప్రిల్ 10 :రామయ పట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సంబంధించి చేపట్టిన భూసే కరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి ఉలవపాడు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇండోసోల్ పరిశ్రమకు సంబంధించి ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, అలాగే మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను మిషన్ మోడ్ లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందులో భాగంగా సర్వే ప్రక్రియను నెల రోజుల లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం భూమి ఎంత ఉంది, అందులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి, డికేటి భూమి ఎంత వుంది, అందులో ఇప్పటివరకు ఎంత భూమి సర్వే చేశారు తదితర వివరాలతో సంపూర్ణ నివేదిక రూపొందించడంతో పాటు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని త్వరితగతిన భు సేకరణ ప్రక్రియను పూర్తీ చేయాలన్నారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా అర్జీదారులకు సహేతుకమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సిద్ధవటం ఎస్సై ని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



సిద్ధవటం ( ప్రజా సీమ) : సిద్ధవటం మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో మండల ఎస్సై పోకల హారిక ను శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసిన సిద్ధవటం సింగిల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామానాయుడు, మాచుపల్లి టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ నర్సింహారెడ్డి , శ్రీ నిత్య పూజేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్, మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి స్వీట్ బాక్స్ అందివ్వడం జరిగిందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# శ్రీ నలంద పాఠశాలలో ఏ ఐ ద్వారా విద్యా బోధన








సిద్ధవటం ( ప్రజా సీమ) : మండల కేంద్రమైన సిద్ధవటం లో స్థానిక శ్రీ నలంద పాఠశాల యందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఎల్.ఈ.డి ప్యానల్ ద్వారా 2026 - 27 విద్యా సంవత్సరం నుండి ఆధునిక విద్యా బోధన జరుగుతుందని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి పాలెం నారాయణ విచ్చేసి ఏఐ,ఎల్.ఈ.డి ప్యానల్ ను ప్రారంభోత్సవం చేశారు.వీరు మాట్లాడుతూ పిల్లల తరగతి గదిలో నాణ్యమైన ప్యానెల్స్ వలన స్పష్టమైన బోధన, అలాగే చిత్రాలు, వీడియోలు చూపించడం వల్ల పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమవుతాయన్నారు. పాఠ్యాంశం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతారని,బోర్డు మీద రాయడం కంటే వీడియోలు/స్లైడ్లు చూపించడం వేగంగా ఉంటుందని,ఇంటరాక్టివ్ లెర్నింగ్ తో పాటు విద్యార్థులకు క్విజ్‌లు, యాక్టివిటీలు పిల్లలు పాల్గొనే అవకాశం ఎక్కువగా ఉంటుందని,అలాగేచిత్రాలు, వీడియోలు చూసి నేర్చుకున్నది పిల్లలు ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారని తెలియచేసారు. అంతేకాకుండా సైన్స్, మ్యాథ్స్, సోషల్, ఇంగ్లీష్ వంటి అన్ని సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకోవచ్చు అన్నారు. అలాగే ఈ పాఠశాల విద్యార్థుల కోసం, కొత్త కొత్త ఆలోచనలతో కార్పొరేటుకు దీటుగా విద్యార్థుల ప్రగతి కోసం అను నిత్యం శ్రమిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యం కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ2026-27 విద్యా సంవత్సరం నుండి సాధారణ ఫీజులతో ఏఐ టెక్నాలజీ ద్వారా విద్యను అభ్యసిస్తూ ఒక పాఠ్యాంశంగా కూడా ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. కావున ఈ విషయాన్ని తల్లిదండ్రులు అందరు కూడా గమనించి మీ పిల్లల విద్యాభివృద్ధి కొరకు తోడ్పడగలరని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాబు, శివ, పిలిపి రాజ్,తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్ కి దూరంగా - క్రీడలకి దగ్గరిగా చేరాలి

## - ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ పిలుపు

## - ఘనంగా 7ఎస్ ఫుట్బాల్ టోర్నమెంట్ ప్రారంభం




మదనపల్లె (ప్రజా సీమ) : యువత డ్రగ్స్ దూరంగా ఉండి క్రీడలకు దగ్గరై మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని,డ్రగ్స్ రహిత మదనపల్లి ఆకాంక్షతో ఫుట్బాల్ 7ఎస్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ పేర్కొన్నారు. సే నో టూ డ్రగ్స్ నినాదంతో మదనపల్లి శానిటోరియం నందు శుక్రవారం కేసి అనిల్ సౌజన్యంతో మహేంద్ర,రాజేష్,ప్రసాద్,మహేష్ తదితరుల ఆధ్వర్యంలో ఈరోజు ప్రారంభమైన 7ఎస్ ఫుట్బాల్ టోర్నమెంటుని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డాగ్స్ మహమ్మారికి దగ్గర అవ్వకుండా క్రికెట్ ఫుట్బాల్,వాలీబాల్ లాంటి క్రీడల్లో తమ ప్రావీణ్యాన్ని చూపిస్తూ మానసికంగా మరియు శారీరకంగా దృఢంగా ఉంటూ తమ లక్ష్యాలను తమ కలలను సహకారం చేసుకునేందుకు చెడు అలవాట్లకి ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని,అలాగే ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకుని క్రీడల్లో రాణించాలని తద్వారా మానసిక,శారీరిక దృఢత్వంతోపాటు మంచి ఆరోగ్యం ఆలోచనలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఫుట్బాల్ టోర్నమెంట్ నిర్వహించడానికి సహకరించిన అనిల్ ను ప్రతి ఒక్కరు అభినందించాలని,అలాగే మహేంద్ర,రాజేష్,ప్రసాద్ వీళ్లు నిర్వాహకులుగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందించదగ్గ విషయమని,ఇలాంటి టోర్నమెంట్లు మరిన్ని జరిగి క్రీడాకారులను ప్రోత్సహించి తద్వారా సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టే విధంగా ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సానిటోరియం సీనియర్ ఫుట్బాలర్స్ మరియు ఫుట్బాల్ క్రీడాకారులను జనసేన పార్టీ సీనియర్ నాయకులు సందీప్ రెడ్డి,నరేష్,విష్ణు,విద్యార్థి నాయకులు స్టీఫెన్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులలో పోలీసు శాఖ ప్రతిష్టను చాటిచెప్పండి

## - హోంగార్డులకు రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపు

## - మదనపల్లిలో ఘనంగా హోంగార్డుల పరేడ్





మదనపల్లె (ప్రజా సీమ) : పోలీసు వ్యవస్థలో హోంగార్డుల సేవలు అత్యంత కీలకమని,విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పనిచేయాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు శుక్రవారం మదనపల్లిలోని బి.టి.కళాశాల పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాస్థాయి హోంగార్డులకు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమాండెంట్ పరేడులో హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించి,సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు. త్వరలో తమిళనాడులో జరుగనున్న సాధారణ ఎన్నికల విధులకు వెళ్లే హోంగార్డులకు ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. పరాయి రాష్ట్రంలో విధులు నిర్వహించేటప్పుడు అత్యంత ఓర్పుతో ఉండాలని,ఓటర్లతో మర్యాదగా ప్రవర్తిస్తూనే నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సవాళ్లతో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని కమాండెంట్ స్పష్టం చేశారు. మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతంగా సేవ చేయగలరని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని,ప్రయాణాల్లో జాగ్రత్తలు వహిస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్,వాహన ఇన్సూరెన్స్ వ్యక్తి గత ఇన్సూరెన్స్ లు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం నిర్వహించిన దర్బారులో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సబ్ డివిజన్ ఇంచార్జీలకు లేదా రిజర్వ్ ఇన్స్పెక్టర్‌కు తెలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండల రెడ్డి,హోంగార్డ్స్ డీఎస్పీ కె.బి.వి ప్రసాద్,రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.సురేష్ కుమార్ రెడ్డి,ఆర్ఎస్ఐలు ఎ.శ్రీనివాస్,జి.రవి,హోంగార్డ్స్ ఇంచార్జీలు మరియు పెద్ద సంఖ్యలో హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్

## - శుభాకాంక్షలు తెలిపిన నిస్సార్ అహ్మద్,పార్టీ ప్రముఖులు



మదనపల్లె (ప్రజా సీమ) : వైఎస్సార్సీపీ అన్నమయ్య జిల్లా బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా మదనపల్లె పట్టణానికి చెందిన శంకర్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మదుని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శంకర్ నాయక్ అహర్నిశలు శ్రమిస్తున్నారని,ఆయన కష్టానికి తగ్గ ఫలితం లభించిందన్నారు. ఆయనను జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం శుభసూచకమని,ఆయన సారధ్యంలో బూత్ కమిటీలు బలోపేతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తానని,జిల్లాలో పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి,మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ మిథున్ రెడ్డి,తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి,మదనపల్లి సమన్వయకర్త నిసార్ అహ్మద్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి,మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ మనూజా రెడ్డి,నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి,ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదములు తెలియజేస్తు న్నానన్నారు. ఈ కార్యక్రమంలో చిప్పిలి మల్లికార్జున రెడ్డి,మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్,నరసిం హులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# ప్రాజెక్ట్ జలధార -- జలహారతి"కు వేగం

## - వర్షజలాల సంరక్షణతో భూగర్భ జలాల పెంపు -- వ్యవసాయానికి కొత్త ఊపు




పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం లో ప్రాజెక్టు జలధార జల హారతి అనే కార్యక్రమం పైన మండలం మండల సభ భవన్లో ఈ కార్యక్రమం నిర్వహించారు అన్నమయ్య జిల్లాలో వర్షాధార నీటిని వృథా కాకుండా వినియోగించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టిన "ప్రాజెక్ట్ జలధార -- జలహారతి" కార్యక్రమం విజయవంతంగా అమలవుతోంది. ఈ ప్రాజెక్టును గత సంవత్సరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించగా, ప్రస్తుతం ఇది గ్రామీణాభివృద్ధికి కీలకంగా మారింది. ఈ కార్యక్రమం ద్వారా వర్షాకాలంలో వచ్చే నీటిని చిన్నచిన్న కాలువల అనుసంధానం ద్వారా చెరువులు, కుంటలకు మళ్లిస్తున్నారు. దీంతో ఎండిపోయిన చెరువులు మళ్లీ నిండిపోతూ భూగర్భ జల మట్టం గణనీయంగా పెరుగుతోంది. తాగునీటి సమస్యలు తగ్గుముఖం పడటంతో పాటు వ్యవసాయానికి కూడా ఈ ప్రాజెక్ట్ ఎంతో మేలు చేస్తోంది. పుల్లంపేట మండలంలో ఈ ప్రాజెక్ట్ అమలు ప్రత్యేక ఫలితాలను ఇస్తోంది. గతంలో కాలువలు మట్టితో పూర్తిగా పూడిపోవడం వల్ల చెరువులకు నీరు చేరని పరిస్థితి నెలకొనగా, ప్రస్తుతం కాలువలను శుభ్రపరచి అనుసంధానం చేయడంతో నీటి ప్రవాహం పునరుద్ధరించబడింది. ఫలితంగా చెరువులు నిండి భూగర్భ జలాలు పెరిగాయి. ఈ కార్యక్రమం వల్ల వ్యవసాయ, హార్టికల్చర్ రంగాల్లో ఉత్పత్తి పెరిగింది. పశుసంవర్ధక రంగానికి నీటి లభ్యత మెరుగుపడింది. విద్యుత్ వినియోగం తగ్గి రైతుల ఖర్చులు తగ్గాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా వందలాది కోట్ల రూపాయల ప్రజా ధనం ఆదా అయ్యిందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్ట్ అమలులో భాగంగా ఎంపీడీవో, ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్డబ్ల్యూఎస్, వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ప్రతి వారం సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పరిశీలిస్తున్నారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు పుల్లంపేట మండలంలో ఈ ప్రాజెక్ట్‌ను ఇరిగేషన్ మరియు ఎన్ఆర్ఈజీఎస్ ఉమ్మడి శాఖల కన్వర్జెన్స్ విధానంలో అమలు చేస్తూ రాష్ట్రంలో ప్రథమ స్థానానికి తీసుకెళ్లాలని అధికారులకు సూచనలు అందించారు. ప్రాజెక్ట్ జలధార -- జలహారతి" వర్షజలాల సమర్థ వినియోగానికి ఆదర్శంగా నిలుస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మారుతోంది. భూగర్భ జలాల పెంపుతో పాటు వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతున్న ఈ కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, వెటర్నరీ డాక్టర్ సుధీష్, ఇరిగేషన్ ఏఈ నాగేంద్ర నాయక్, ఆర్డబ్ల్యూఎస్ దినేష్, ఏవో శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, చెరువు సంఘం అధ్యక్షులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# పుల్లంగేరు వద్ద గుర్తుతెలియని శవం

## - పోలీసుల దర్యాప్తు ప్రారంభం



పుల్లంపేట ప్రజా సీమ న్యూస్ : తిరుపతి జిల్లా కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట గ్రామం నుంచి సీతారాంపేటకు వెళ్లే మార్గమధ్యంలోని పుల్లంగేరు వద్ద గుర్తుతెలియని శవం లభించడం స్థానికంగా కలకలం రేపింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వ్యక్తులు శవాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పుల్లంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి, అనంతరం పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, అతని గుర్తింపుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణమా లేదా ఇతర కారణాల వలన జరిగిందా అన్న అంశంపై విచారణ కొనసాగుతుందని తెలిపారు.

# పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి

## మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశం



మదనపల్లె (ప్రజా సీమ) : వేసవిని దృష్టిలో ఉంచుకొని మదనపల్లి పట్టణంలో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమీలతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా కౌన్సిలర్ల పదవీ కాలం ముగియడంతో ఆయా అవార్డుల పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులతో సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకొని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన తర్వాత మదనపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ముఖ్యంగా రామారావు కాలనీ, గజ్జలకుంట, సొసైటీ కాలనీ మరికొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా పట్టణంలో ప్రతి మూడు రోజులకు ఒకసారి నీటిని వదిలి, ప్రజలు కష్టాలను తీరుస్తామన్నారు. మునిసిపల్ కార్యాలయం అంతా బోసిపోయిందని, ఒక్క ఛైర్ పర్సన్ చాంబరు మాత్రం అన్నిహంగులతో ఉందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలకులు కౌన్సిల్ హాల్, ఇతర గదుల మరమ్మతులను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రత్యేక అధికారి పాలనలో మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిశెట్టి పురుషోత్తం, నవీన్ చౌదరి, రెడ్డి రాయల్, మార్పురి నాగార్జున బాబు, సిబిఎన్ రెడ్డి శేఖర్, చల్లా చలపతి, విద్యాసాగర్, జాఫరన్నీషా తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

## - కలెక్టర్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘాల నిరసన
## - జాయింట్ కలెక్టరుకి వినతి పత్రం సమర్పణ






మదనపల్లె (ప్రజా సీమ) : గిరిజన మహిళపై జరిగిన దాడిని గిరిజన సంఘాలు నాయకులు తీవ్రంగా ఖండించాయి. ఈ విషయంపై శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జాయింట్ కలెక్టరుకి ఫిర్యాదు చేసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూ వివాదం అంశంలో గిరిజన మహిళ భుక్యా మునెమ్మపై దాడి చేసిన విషయంపైన గిరిజన సంఘాల నాయకులు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. గిరిజన మహిళ భూమి విషయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఆమెకు న్యాయం చేయాలని కోరారు. మహిళ అని చూడకుండా దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, గిరిజన మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళ భూవివాదంపైన అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తి పైన జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరితగతిన ఈ అంశంపైన సమగ్ర విచారణ జరిపి గిరిజన మహిళకు అన్నివిధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు భుక్యా నాగు నాయక్, అఖిల భారత బంజారా సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాల్యా అమరేంద్ర నాయక్, గిరిజన విద్యార్థి సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బాణావత్ రఘునాయక్, గిరిజన సంఘం నాయకులు భుక్యా శంకర నాయక్, భుక్యా కృష్ణగోపాల్ నాయక్, మీసేవ నాగరాజు నాయక్, బాణావతి కుమార్ నాయక్, బాణావత్ చంద్రశేఖర్ నాయక్, బాణావత్ శంకర్ నాయక్, భుక్యా మునీంద్రా నాయక్, భుక్య దినకర్ నాయక్, మహిళా నేతలు పాల్గొన్నారు.

# సమాజసేవలో తనదైన పాత్ర పోషిస్తున్న గ్రేట్ విజన్ సొసైటీ

## - డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు సేవలు అమూల్యం
## - అనేక అవార్డులు, డాక్టరేట్లు ఆయన సొంతం








మదనపల్లె (ప్రజా సీమ) : సమాజసేవలో గ్రేట్ విజన్ సొసైటీ (జివిఎస్) తనదైన పాత్ర పోషిస్తోంది. గానుగ పెంట వెంకటరమణ అటవీ శాఖలో పనిచేస్తూ నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పెద్ద కుమారుడు జీవీఎస్ బాబుకి సమాజ సేవ అంటే ఎనలేని మక్కువ, చిన్నపిల్లలంటే మహా ఇష్టం, పిల్లల హక్కులపై పోరాడుతూ ఎక్కడైతే బాల కార్మికులు ఉన్నారో వారిని చేరదీసి ఖచ్చితంగా వారిని చదివించి సమాజంలో వారికంటూ ఒక గుర్తింపు తీసుకురావాలని తపన ఆయనది. అటువంటి గొప్ప ఆలోచనతో 2005లో గ్రేట్ విజన్ సొసైటీని స్థాపించారు. అలా ఆయన జాతీయ బాల కార్మిక నిర్మూలన కార్యక్రమం నందు ఒక పాఠశాలను స్థాపించి ఎవరైతే బాల కార్మికులు ఉంటారో వారందరినీ ఆ పాఠశాలలో చేర్పించి దాదాపు 680 మంది బాల కార్మికులను వెతికి వారిని చేరదీసి విద్యపై మంచి అవగాహన కలిగేలా మంచి ఉపాధ్యాయుడిగా శిక్షణ అందించి ప్రస్తుతం వారు వివిధ ప్రాంతాలలో వృత్తిరీత్యా విధులు నిర్వహిస్తూ స్వశక్తితో సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచారు. బాలకార్మికుల నిర్మూలనే తన అభివృద్ధిగా భావించే ఆయనకు వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉండే పిల్లలతోవారి కుటుంబాలతో పని చేసేనైపుణ్యం కూడా ఉంది. వారికి కూడా మంచి విద్యను అందించే ప్రయత్నం చేసి వారికి ప్రభుత్వం అందించే పథకాలను వివరించి వారి జీవితాల్లో కూడా వెలుగు నింపుతున్నారు. అసలే పిల్లలు అంటే ఇష్టం అని చెప్పాం కదా అందుకుని పీలేరు నుంచి తన సేవలను విస్తృతం చేస్తూ మదనపల్లెలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని నిరాశ్రయులైన పిలల క్షేమం కోసం 2020 నుండి చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ కొరకు అడ్మిన్ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తూ ఆయన యొక్క సేవలు అనిర్వచనీయం. ఆయన సేవలను గుర్తించి ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థలు జాతీయస్థాయిలో అవార్డులతో సన్మానించడమే కాకుండా డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. అలానే ఢిల్లీలో జరిగిన అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు, సర్దార్ వల్లభాయ్ పటేల్ సమ్మాన్ - 2025 పురస్కారం, అబ్దుల్ కలాం అవార్డు, గద్దర్ అవార్డు మదర్ థెరిసా అవార్డు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అవార్డులు ఆయన సొంతమయ్యాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా మదర్ థెరిసా ఫౌండేషన్ వారు సేవారత్న - 2026 అవార్డుకి ఎంపిక చేయడం హర్షణీయం. పిల్లలంటే మక్కువ ఎక్కువైన ఆయనకు పీలేరు మారుమూల గిరిజన ప్రాంతాలలో మొబైల్ ఫోన్లకు, టీవీలకు పిల్లలు అలవాటు పడి విద్యను తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెడుతున్నారని గ్రహించి రామానాయక్ తాండాలోని పిల్లలకు ఉచితంగా ఈవినింగ్ స్టడీ సెంటర్స్ కల్పించాలని గ్రేట్ విజన్ సొసైటీ ద్వారా జి.వీ.యస్.విద్యా దీపం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దాదాపు నాలుగు సంవత్సరాలుగా ఉచితశీగా ఈవినింగ్ స్టడీస్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పిల్లల కోసం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో గ్రేట్ విజన్ సొసైటీ (జివిఎస్) ద్వారా భాగస్వాములు అవుతున్నారు.

**సమాజ శ్రేయస్సే ఆయన నినాదం**

సమాజ శ్రేయస్సు కోసం ఆయన నిరంతరం పరితపిస్తుంటారు. బాలకార్మిక అభివృద్ధి తన అభివృద్ధిగా భావిస్తున్న డాక్టర్ జి.వీ.సుబ్రహ్మణ్యం బాబు కృషికి పట్టుదలకి మరిన్ని సహాయ, సహకారాలు అందించే దిశగా సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకునే దిశగా ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం కావాలనే దిశగా ఉండాలని కోరుకుంటుంది. చిన్నారులు, శ్రేయోభిలాషులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ భగవంతుడు ఆశీస్సులతో ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, మరింత సేవా చేసే శక్తిని ప్రసాదించాలని పలువురు ఆకాంక్షించారు.

# అభివృద్ధితోపాటు ప్రజా ఆరోగ్యం కు పెద్దపీట

## - మెగా ఉచిత కంటి శిబిరం విజయవంతం చేద్దాం
## - పార్టీ శ్రేణులకు చమర్తి పిలుపు

రాజంపేట, (ప్రజా సీమ) : పార్టీతోపాటు కార్యకర్తలు ప్రజా ఆరోగ్యం పై కూడా దృష్టి సారించాలని, రాజంపేట నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజలకు మంచి ఆరోగ్యం అందించేలా అనేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయబోతున్నామని, అందులో భాగంగా 16వ తేదీ రాజంపేటలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై అవకాశాన్ని సద్వినియోగపరుచుకునేలా కార్యకర్తలు గ్రామ గ్రామాన కంటి సమస్యలు ఉన్నవారిని ఉచితంగా వైద్యం పొందేలా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛంద సంస్థలు, టిడిపి కార్యకర్తలు తలచుకుంటే మనం చేసే మంచి పని ప్రజలందరికీ ఉపయోగపడుతుందని రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తుందని, నియోజకవర్గ వ్యాప్తంగా ప్రాధాన్యత ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. శుక్రవారం నాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ నాయకులతో పార్టీ సమీక్షా సమావేశాన్ని చమర్తి జగన్ మోహన్ రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆరోగ్య రాజంపేటే లక్ష్యంగా ఈనెల 16 వ తేదీన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చమర్తి జగన్ మోహన్ రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు గురించి ప్రజలకు వివరించాలని చమర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతకముందు దివ్యాంగులు చమర్తిని మర్యాదపూర్వకంగా కలవగా వారిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల పార్టీ







అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ స్థాయి నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సమస్య మీది పరిష్కారం మాది

## - రైల్వే కోడూరు ప్రజా దర్బార్ లో ముక్కారూపానంద రెడ్డి,,,
## - తక్షణమే స్పందించి సమస్యల పరిష్కార దిశగా చర్యలు
## - ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న యువ నేత ముక్కాసాయి వికాస్ రెడ్డి






రైల్వే కోడూరు (ప్రజాసీమ) : రైల్వే కోడూరు పట్టణం రాఘవరాజుపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జ్ మరియు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ముఖ్యంగా ఇంటి స్థలాలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలతో పాటు ఎండాకాలంలో తాగునీటి కొరతపై పలు గ్రామాల ప్రజలు వివరించారు.ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ముక్కా రూపానంద రెడ్డి , వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఎండాకాలంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తామనీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమం పట్ల ఉన్న కృషి, మార్గదర్శకంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే వారి సంకల్పంతోనే ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ లో వినతుల వెల్లువ

## - చమర్తి పై భరోసా తో ప్రజలు
## - దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి
## - నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు






రాజంపేట(ప్రజా సీమ) సమస్య ను ఆ నాయకుని దృష్టికి తీసుకువెళ్తే వెంటేనే పరిష్కారమైతాదని నమ్మకంతో రాజంపేట నియోజకవర్గంలో చమర్తి ప్రజా దర్బార్ కు అనూహ్య స్పందన లభిస్తుంది. ఇటీవల కాలంలో చమర్తి గల్లీబాట పేరుతో ఇంటింటికి టిడిపిని చేర్చే ఉద్దేశంతో పలు ప్రాంతాలలో పర్యటించిన చమర్తి సమస్యలను వేగంగా పరిష్కరించడంతో ఇప్పుడు జనం చూపు చమర్తి వైపు వెళ్లడంతో తమ సమస్యలు పరిష్కరించేందుకు చమర్తి సరైన నాయకుడిని పలువురు నమ్ముతున్నారు. అందుకు నిదర్శనమే శుక్రవారం రాజంపేట తెలుగుదేశం కార్యాలయంలో ప్రజా దర్బార్ కు వచ్చిన స్పందన. ఈ సందర్భంగా ప్రజా దర్బార్ లో చమర్తి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని,ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడం లక్ష్యమని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు పార్టీ పిలుపుమేరకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలపై ప్రజల నుంచి చమర్తి జగన్ మోహన్ రాజు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ సమస్యలు స్వయంగా విన్నామని,త్రాగునీరు,విద్యుత్,రోడ్లు,పింఛన్లు,భూ వివాదాలు వంటి అంశాలపై వచ్చిన ఫిర్యాదులకు వెంటనే చర్యలు తీసుకుంటామని చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. అంతకుముందు ప్రజా దర్బార్ ద్వారా అర్జీదారులు భూ వివాదాలు, ఇండ్ల స్థలాలు, డ్రైనేజీ, తదితర అంశాలపై చమర్తి జగన్ మోహన్ రాజు కి ప్రజలు నేరుగా విన్నవించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర చైర్మన్ తో డైరెక్టర్ల సమావేశం

## రాష్ట్ర డైరెక్టర్ నాగూరు వీరభద్రుడు




సిద్ధవటం ( ప్రజా సీమ ) : మండలంలోని, పార్వతి పురం గ్రామంలో తన నివాసంలో శుక్రవారం రాష్ట్ర డైరెక్టర్ నాగూరు వీరభద్రుడు ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ల వ్యవస్థ బలపడే విధంగా సీఎం కృషి పట్టుదల మరవలేని విషయమని తెలిపారు రాష్ట్ర నూర్ భాషా దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నాగూర్ మీరా తో 15 మంది రాష్ట్ర డైరెక్టర్ల సమావేశం గురువారం విజయవాడలో తన నివాసంలో ఏర్పాటుచేసి కార్పొరేషన్ సంబంధించి పలు అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ పలు అంశాలు చర్చించడం జరిగిందని ఆయన అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూదేకుల సంక్షేమ అభివృద్ధికి ఆయన చేసిన కృషి పట్ల కృతజ్ఞతలు తెలిపామని నూర్ భాషా అండ్ దూదేకుల కార్పొరేషన్ ను రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి ఫైనాన్స్ కార్పొరేషన్ గా మార్చిడి పట్ల దూదేకుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపామని తెలిపారు

# రూ.10 కోట్లతో నిర్మించే కలకడ లయన్స్ ఆస్పత్రికి స్థలం కేటాయించండి

## -కలెక్టర్ కు వినతి చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు



కలకడ(ప్రజా సీమ) : కలకడ లయన్స్ క్లబ్ సేవ ట్రస్ట్ రూ.10 కోట్లతో నిర్మించే చారిటబుల్ ఆసుపత్రికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కు ట్రస్ట్ సభ్యులు వినతి చేశారు. శుక్రవారం మదనపల్లె కలెక్టరేట్ లో లయన్స్ క్లబ్ ప్రతినిధి దగ్గుపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కలకడలో పేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ట్రస్ట్ సిద్ధంగా ఉందని, అధునాతన పరికరాలు, మంచి వైద్యులతో ఆస్పత్రి నిర్వహిస్తామని చెప్పారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సహకారంతో లయన్స్ సేవ ట్రస్ట్ కలకడలో పేద ప్రజలకు వివిధ రకాల జబ్బులకు సంబంధించి వైద్య సేవలు అందిస్తామన్నారు. తాను చదివిన కలకడ జడ్పీ హైస్కూల్ ప్రధాన ద్వారం ఆర్చి, కాంపౌండ్ వాల్ రిపేర్లు, ప్రార్థన స్టేజ్, షెడ్లు, లైబ్రరీలను లయన్స్ క్లబ్ ద్వారా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే కలకడ మండలంలో సోలార్ సిసి కెమెరాలు, కలకడ పోలీస్ స్టేషన్ కు ఇన్వర్టర్, కోన జడ్పీ హైస్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్ , మండల వ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి విజేతలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగిందని చెప్పారు. కలకడలో ప్రభుత్వ స్థలం కేటాయిస్తే సేవా ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు అందిస్తామన్నారు. ఈనెల 20వ తేదీ కలకడలో 500 మంది ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించగా కలెక్టర్ నిశాంత్ కుమార్ తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలకడ లయన్స్ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాల బుక్ లెట్ అందజేశారు. కార్యక్రమంలో కలకడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బరకం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఎం. పునీత్ చౌదరి, ప్రతినిధులు మురళీమోహన్, కాంతారావు, బాలినేని హరినాథ్ , రెడ్డి శేఖర్, భరత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విజయాలు.. ట్రిపుల్ ఐటీకే ప్రతిష్ట

## - డైరెక్టర్ కుమారస్వామిగుప్తా
## - ఈ విజయాలు స్ఫూర్తిగా నిలవాలి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: భారతదేశ అత్యున్నత ఇంజనీరింగ్, సైన్స్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాతీయ స్థాయి గేట్-2026 పరీక్షల్లో ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలు ట్రిపుల్ ఐటీ ప్రతిష్టను మరింత పెంచిందని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ట్రిపుల్ ఐటీ ఉన్నత విద్య, పోటి పరీక్షల విభాగం కోఆర్డినేటర్ డా. కోనప్ప ఆధ్వర్యంలో గేట్-2026 విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి గేట్ పరీక్షల్లో 5, 8, 22, 53, 84వ ర్యాంక్ లతో పాటు 36 మంది విద్యార్థులు వెయ్యి లోపు జాతీయ ర్యాంక్ లు సాధించారని, మొత్తంగా 155 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంక్ లు సాధించినట్లు వెల్లడించారు. ఈ విజయాలు ఇతర విధ్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం ట్రిపుల్ ఐటీ ఏఓ డా.రవికుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం సరైన సంస్థలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాగే డా.కోనప్ప మాట్లాడుతూ విధ్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితంగా ఈ విజయాలు సాధ్యమెనట్లు వెల్లడించారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సాహించారు. డైరెక్టర్ చేతుల మీదుగా విధ్యార్థులకు మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి డా.జీ.రమేష్, ఇతరత్రా అధికారులు డా.రత్నకుమారి, ధనుంజయ్, వీరేష్, షాజాద్, వెంకటేష్, భాస్కరయ్య, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో పాత్రికేయుడు గంగాధర్ మృతి

## - నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో పాత్రికేయుడిగా పనిచేస్తున్న గంగాధర్గురువారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే వారి ఇంటి వద్దకు వెళ్ళి గంగాధర్ పార్థివదేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రెడ్డీ సాహెబ్ మాట్లాడుతూ మంచి వ్యక్తిగా,పాత్రికేయ వృత్తిలో అందరికీ సుపరిచితుడుగా గుర్తింపు పొందిన గంగాధర్ ఆకస్మిక మృతి దురదృష్టకరమన్నారు. నిస్వార్థంగా సమాజ సేవలు అందించడంలో పాత్రికేయుల కృషి ఎంతో ఉందన్నారు. గంగాధర కుటుంబానికి అధికారులు,ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

## రాజంపేట ఏ.ఎస్.పీ మనోజ్ రామనాథ్ హెగ్డే హెచ్చరిక







రాజంపేట(ప్రజా సీమ) :రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని లేకుంటే చర్యలు తప్పవని రాజంపేట ఏ.ఎస్.పీ మనోజ్ రామనాథ్ హెగ్డే రౌడీషీటర్లను హెచ్చరించారు. జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, చెడు ప్రవర్తన కల్గిన వారికి శుక్రవారం రాజంపేట ఎ.ఎస్పీ కార్యాలయం లో కౌన్సిలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. నేరస్తుల తొందరపాటులో నేరాలు చేసినా.. వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుందని గ్రహించాలని అన్నారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, దౌర్జన్యాలకు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. పద్దతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదుచేస్తామన్నారు. అనంతరం రౌడీ షీటర్లను బైండ్ ఓవర్ నిమిత్తం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. కార్యక్రమం లో మన్నూరు సి.ఐ లింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులుగా షేక్ ఉబేదుల్లా



పీలేరు(ప్రజా సీమ) :అన్నమయ్య జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడిగా షేక్ ఉబేదుల్ల ను నియమించిన సందర్భంగా, ఆయన పార్టీ ముఖ్య నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ ఉబేదుల్ల మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. అలాగే రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డికి , పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కి ఈ అవకాశం కల్పించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడిగా తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న తప్పులను పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని సోషల్ మీడియా వేదికల ద్వారా యువతను ఆకర్షిస్తూ, పార్టీకి మరింత బలం చేకూర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తనని ఈ బాధ్యతను తనకు అప్పగించిన నాయకులందరికీ మరొక్కసారి ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు.

# మంత్రి లోకేష్ బాబుకి సాదర స్వాగతం పలికిన శ్రీరామ్ చినబాబు





మదనపల్లె (ప్రజా సీమ) : ఏపీ మానవవనరుల,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు బెంగళూరు హెచ్.ఏ.ఎల్ విమానాశ్రయంలో శుక్రవారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. చినబాబుతోపాటు ఎన్.పి.ఎస్ డెవలపర్స్ నవీన్ కుమార్ మరియు ఆర్ అండ్ వై రియాల్టీ డెవలపర్స్ రిషబ్ తదితరులు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ కర్ణాటక రాజధాని బెంగళూరు పర్యటనకు విచ్చేసిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని,ఆయన మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ సారధ్యంలో ఏపీ ఐటీ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. నేటి యువతకు ఆయన రోల్ మోడల్ అని ప్రశంసిస్తూ ఆయన సారధ్యంలో పనిచేయడం గర్వంగా ఉందని వెల్లడించారు.

# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

## - ఎమ్మెల్యే షాజహాన్ బాషాకి అపస్ నాయకుల వినతి




మదనపల్లె (ప్రజా సీమ) : ఉపాధ్యాయ, ఉద్యోగుల ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న 12వ పిఆర్సీ,30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని రాష్ట్రవ్యాప్త ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ఉద్యమంలో భాగంగా శుక్రవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాకి ఆ సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వు 57 అమలు చేసి,2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరులుగా పదోన్నతులు కల్పించాలని,ఏకీకృత సర్వీసు రూల్స్ అమల్లో ఉన్న ఇబ్బందులను సరిచేసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి,నిర్ణీత కాల పరిమితిలో అన్ని క్యాడర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. హైస్కూల్ ప్లస్ లను బలోపేతం చేసి రెగ్యులర్ ప్రాతిపదికన పిజిటిలను నియమించాలని,ప్రాథమిక విద్య తప్పనిసరిగా తెలుగు మీడియంలో బోధించి,ఉన్నత పాఠశాలలో సమాంతర తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. పై సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపస్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమణారెడ్డి అపస్ నాయకులు ఈశ్వరయ్య రమణప్ప,సిద్ధారెడ్డి,వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల పై టిడిపి నేతల ఫిర్యాదు



ఒంటిమిట్ట,(ప్రజా సీమ) :కడప జిల్లా ఒంటిమిట్ట సీఐ నరసింహులుకు నందలూరు టీడీపీనేతలు వైసీపీ నేతల పై ఫిర్యాదు చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు స్వాహా చేశారని రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరు వేణు గోపాల్ పై వైసీపీ నేతలు సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడు అయిన రేవూరు వేణుగోపాల్ తెలుగుదేశం పార్టీలో ఎదుగుతుంటే చూడలేక వైసీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారనీ వారి బండారం బయట పెడతామని హెచ్చరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన తుంటి ఎల్లయ్య తన పరిహారం పోను, ఆయన చికిత్స కోసం వడ్డీకి తీసుకున్న డబ్బులను వడ్డీ లేకుండా తిరిగి చెల్లిస్తే దానిపై దుష్ప్రచారం చేస్తున్నా రన్నారు. తుంటి ఎల్లయ్య అనారోగ్యంతో అవగాహన లోపంతో మాట్లాడిన మాటలను వక్రీకరించి, రేవూరు వేణుగోపాల్ పై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు వారు నందలూరు ఎస్సై కు,ఒంటిమిట్ట సి.ఐ.కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందలూరు సింగిల్ విండో అధ్యక్షులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, నందలూరు మండల కో క్లస్టర్ చుక్క యానాది, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు జ్యోతి శివ, నియోజవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి రెడ్డి శేఖర్ గౌడ్, నియోజవర్గ తెలుగు మహిళా నాయకురాలు కోటపాటి సుబ్బమ్మ, నాగిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు గంధం గంగాధర్ పార్లమెంట్ తెలుగు యువత నాయకులు సురేష్, నాయకులు కోన శివప్రసాద్, తేజాల ఆనంద్, గోపాల్ ,సాయి ,హరి ,రమేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు


# ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తలు తీసుకోండి : వైద్యాధికారి శ్రీవిద్య



సిద్ధవటం (ప్రజా సీమ ) : అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని 104 వైద్య శిబిరంలోవైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. మండలంలోని నేకనాపురం గ్రామంలో శుక్రవారం104 వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేషెంట్లకు ఉష్ణోగ్రత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు ఈ సందర్భంగా మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ వృద్ధులు వయోవృద్ధులు ఉష్ణోగ్రతల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వడదెబ్బ నివారణకు తాగునీరు, మజ్జిగ, కొబ్బరి బొండం వంటి పానీయాలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ మా సిబ్బందితో సంప్రదించి ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు వినియోగించుకోవాలని నీరసం అలసట, అధికంగా చెమటలు పోయడం లక్షణాలు ఉన్న పేషెంట్లు అందుబాటులో ఉన్న వైద్యుని సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలి

## - తహసీల్దార్‌కు ఎంపీపీ బాబుల్ రెడ్డి వినతి



పుల్లంపేట ప్రజా సీమ న్యూస్ : తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం అనంతసముద్రం గ్రామపంచాయతీలో వివాదాల కారణంగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి తహసీల్దార్ పుల్లారెడ్డిని కోరారు. అనంతసముద్రం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 374లో రహదారి నిర్మాణానికి సంబంధించి కొంతమంది రాజకీయ నాయకులు అడ్డంకులు సృష్టించడం వల్ల పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో 3 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టగా, ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తై, సుమారు 210 మీటర్ల పని మాత్రమే మిగిలి ఉందని పేర్కొన్నారు. రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, సంబంధిత ఆధారాలను పరిశీలించిన కోర్టు రహదారి నిర్మాణానికి సానుకూల అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు కోర్టు తీర్పు పత్రాలను తహసీల్దార్‌కు సమర్పిస్తూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ పుల్లారెడ్డి, హైకోర్టు అనుమతులను పరిశీలించి రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులకు అడ్డంకులు సృష్టించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మస్జిద్-ఎ-అల్ హబీబ్‌లో ప్రత్యేక ప్రార్థనలు

## - పాల్గొన్న మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్



మదనపల్లె (ప్రజా సీమ) : శుక్రవారం పవిత్రతకు,ముస్లింల మత ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చి పండుగ రోజు ఏవిధంగా ప్రార్థనలకు హాజరవుతారో అదేవిధంగా చేయడం ప్రతి ముస్లిం విధానమని మదనపల్లె వైయాస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు.స్థానిక ముస్లింల ఆహ్వానం మేరకు మదనపల్లె మండలం బసినికొండ వై-జంక్షన్ శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ సమీపంలోని మస్జిద్-ఎ-అల్ హబీబ్‌లో ప్రత్యేక ప్రార్థనలలో మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పాల్గొన్నారు.స్థానిక ముస్లింల ఆహ్వానం మేరకు ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులో ప్రార్థనలు చేయడానికి విచ్చేసిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు.అనంతరం స్థానిక వైసిపి నాయకులతో సమావేశమై యోగక్షేమాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో నిస్సార్ అహమ్మదుతోపాటు ముతవల్లి లతీఫ్,మన్సూర్ రిజ్వీ,సయ్యద్ వసీం,సయ్యద్ బాషా,ఫరీద్,యూనస్,ఎన్.నవాజ్,ఫక్రుద్దీన్,జబివుల్లా,అన్సార్,బషీర్,నాసిర్,సత్తార్,యాసిన్,తాజ్ నట్స్,ఇలియాస్,రియాజ్,జైనుద్దీన్,అరా మస్తుద్దీన్,అరాఫా తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యమే భవిష్యత్తుకి భరోసా

- పౌష్టికాహారం ఆరోగ్యానికి బలమైన పునాది
- 8వ పోషణ పక్వాడపై విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం



మదనపల్లె (ప్రజా సీమ) : జిల్లాలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాల ద్వారా ఈ నెల 23 వరకు అంగన్వాడీ కేంద్రాలు,పంచాయతీలు మరియు గ్రామస్థాయిలో పౌష్టికాహారం లోపంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులు ఆదేశించారు.శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్లోని తన చాంబరులో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం తల్లిదండ్రులు,గర్భిణీలు మరియు బాలింతల్లో పోషకాహారంపై అవగాహన పెంచడం,అనారోగ్యకర ఆహారపు అలవాట్ల వల్ల కలిగే ప్రమాదాలను వివరించాలని పేర్కొన్నారు.పిల్లల జననం నుండి రెండు సంవత్సరాలలోపు 1000 రోజుల కాలం అత్యంత కీలకమని,ఈ దశలోనే మెదడు అభివృద్ధిలో 80 శాతం పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమయంలో సరైన పోషకాహారం,సంరక్షణ చాలా అవసరమని స్పష్టం చేశారు.పౌష్టికాహారం ఆరోగ్యానికి పునాది లాంటిదన్నారు.పౌష్టికాహారం లోపం వల్ల పిల్లల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని,ఊబకాయం,మధుమేహం,ఏకాగ్రత లోపం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.స్థానికంగా లభించే సంప్రదాయ ఆహారాలను ప్రోత్సహించాలని సూచించారు.

**జంక్ ఫుడ్,అధిక ఉప్పు-నూనె ప్రమాదకరం**

జంక్ ఫుడ్ వినియోగం,మితిమీరిన ఉప్పు మరియు నూనె వాడకం ఆరోగ్యానికి హానికరమని,ఇవి భవిష్యత్తులో అనేక రకాల వ్యాధులకు దారితీస్తాయని తెలిపారు.రెండు సంవత్సరాల లోపు పిల్లలకు మొబైల్ స్క్రీన్ వినియోగం వల్ల మానసిక,శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని,స్క్రీన్ టైమ్ తగ్గించి ఆటలు,కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూసీడబ్ల్యూ అండ్ ఈఓ కె.హైమావతి,పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్,డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ అసిస్టెంట్,డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్,సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## -ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలి -జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్



అనకాపల్లి.ఏప్రియల్10(ప్రజా సీమ) :రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ,జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన ప్రదేశాలలో అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి"జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ" సమావేశం జరిగింది.ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా,జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్,జంక్షన్లు దగ్గర లైటింగు ఏర్పాటు చేయాలని అలాగే స్పీడ్ బ్రేకర్లు దగ్గర రేడియం కలర్ పెయింటింగ్ వేయాలని ఆదేశించారు.జిల్లాలో ఇప్పటివరకు రాష్ట్ర,జాతీయ రహదారులలో జరిగిన రోడ్డు ప్రమాధాలు,ప్రమాదం వలన చనిపోయిన వారి సమగ్ర వివరాలను తెలుసుకొని కారణాలను విశ్లేషించారు.రోడ్డు ప్రమాదాలు ఏ కారణంగా జరుగుతున్నాయో ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించాలన్నారు. ప్రమాదాల వలన చనిపోయిన వారికి పరిహారం త్వరతగతిన అందేవిదంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు స్పందించి క్షతగాత్రులను తక్షణమే దగ్గరలోని ఆసుపత్రిలో చేర్పించి క్షతగాత్రుల వివరాలు రవాణా శాఖ అధికారులకు ఇవ్వాలని జిల్లా వైద్య శాఖ అధికారికి ఆదేశించారు.కూడళ్లలోను,తరచు ప్రమదాలు జరిగే ప్రదేశాల వద్ద సి.సి.టి వి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.బస్ స్టాప్ లు వద్ద బస్సులు ఆగే విదంగా చూడాలని అలాగే బస్ స్టాప్ లు వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ప్రవీణా ని ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ,ప్రమాదకర రహదారులు,మలుపులు,ట్రాఫిక్ జంక్షన్ల వద్ద సరిపడా లైట్లు ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు.జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని,ఇందుకు పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం రావాలని,ఇందుకు అవసరమైన ర్యాలీలను, ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు,జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్ మాట్లాడుతూ ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని కృషి చేస్తామన్నారు.ఇప్పటికే హెల్మెట్ ధారణ చేయనివారిని,స్పీడ్ గా వాహనాలు నడిపే వారిని,రాంగ్ రూట్ లలో వాహనాలు నడిపే వారిని,లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి అపరాధ రుసుమును విధించడం జరుగుతుందని తెలిపారు.రహదారి భద్రతపై ప్రజలను చైతన్య పరచడంజరుగుతుందన్నారు.లారీ,ఆటో డ్రైవర్లు,ఆర్టిసి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవగాహనా కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.సమావేశంలో జిల్లా రవాణా,ప్రజా రవాణా అధికారి, ప్రవీణా,నర్సీపట్నం ఆర్.డి.ఒ. వివి రమణ,డిఎంహెచ్ఓ డాక్టర్ హైమావతి,రోడ్లు భవనాలశాఖ ఇఇ ఎన్.సాంబ శివరావు,డిఇఇ విద్యాసాగరరావు,డి.ఎస్పీ.లు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు,పోలీసు ఇన్స్పెక్టర్లు,ఎన్ హెచ్ ఎ ఐ, మైనింగు,పరిశ్రమలు,డిఆర్డిఎ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హజ్ కమీటీ చేర్మెన్ హసన్ బాష అందిస్తున్న సేవలను అభినందీస్తున్న ముస్లిం మైనార్టీలు






కడప ఏప్రిల్ 10 (ప్రజా సీమ): పువ్వు పుట్టగానే ఎలా పరిమళిస్తుందో అలాగే ఆల్ హజ్ హసన్ బాష రాష్ట్ర హజ్ కమీటీ చేర్మెన్ గా 2025 పదవి చేపట్టినప్పటి నుండి హజ్ యాత్రీకులకు అనేక విధాలుగా సేవాలందిస్తున్నారని రాష్ట్ర ముస్లిం సమాజం ఆయనను అభినందీస్తుంది.గత సంవత్సరం హజ్ యాత్రికులు మక్కా నుండి మదీన వెళ్లే వేళ జరిగిన బస్సు ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే తన వంతు బాధ్యత గా హెల్ప్ లైన్ ఏర్పాటు చేసి హజ్ యాత్రికుల క్షేమసమాచారాలు అందించి మన్ననలు పొందారు. ఈ ఏడాది హజ్ కు వెళ్లే యాత్రికుల కోసం హజ్ యాత్ర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.హజ్ యాత్రికుల ఆరోగ్యం కోసం రాష్ట్రం నుండి వైద్యబృందాన్ని ఏర్పాటు చేసి హజ్ యాత్రికులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ద్వారా హజ్ యాత్ర చేసి వచ్చే వరకు వారి బాగోగులు,క్షేమసమాచారాలపై దృష్టి సారిస్తు అందరి మన్ననలు పొందుతున్నారు.ఆల్ హజ్ ఎస్ హసన్ బాష తనకు ఇచ్చిన రాష్ట్ర హజ్ కమీటీ చేర్మెన్ బాధ్యతలను తూ.చ తప్పకుండా పాటిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు అభిమానాన్ని చూరగొన్నారు.దాదాపు మూడున్నర దశాబ్దాలుగా టీడీపీ పార్టీలో ఉంటు అనేక పదవులు చేపట్టి పార్టీకి విధేయుడిగా రాష్ట్ర పార్టీ కార్యాలయం లో రిసెప్షన్ లో ఉంటూ ప్రజల నుండి దరఖాస్తులు తీసుకుంటు, వారి అభ్యర్థనలు ఓపికగా వింటు పార్టీ అధిష్టానానికి తెలుపు ఇటు అన్నివర్గాల ప్రజలకు అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మినబంటుగా ఉంటున్న అల్ హజ్ ఎస్ హసన్ బాష భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది ముస్లిం సమాజానికి మరిన్ని సేవలు అందించాలని రాష్ట్ర ముస్లిం సమాజం కోరుతుంది.


# వైభవంగా భక్తిశ్రద్ధలతో కాళ్ళ గంగమ్మ తిరుణాల



ఒంటిమిట్ట ఏప్రిల్ 10 (ప్రజా సీమ) : ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన కాళ్ళ గంగమ్మ తిరుణాల నాలుగవ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతున్నదని నిర్వాహకులు వెల్లడించారు. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, రాత్రి చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం బండారుపల్లి మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్నం బండారు పల్లి యూత్ ఆధ్వర్యంలో భక్తులకు గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నము 3 గంటలకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎద్దుల బండలాగుడు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. పాటూరు సీడ్స్ అధినేత సుబ్బారెడ్డి ప్రధమ బహుమతిగా 60000 రూపాయలు, కూండ్ల ఓబుల్ రెడ్డి ద్వితీయ బహుమతిగా 40 వేల రూపాయలు, మోదుగుల రామ నర్సింహులు తృతీయ బహుమతిగా 30 వేల రూపాయలను, నాలుగవ బహుమతిగా మోదుగుల చిన్న నరసింహులు మరియు మోదుగుల తిరుపాలు 20వేల రూపాయలు, తేలూరు వెంకట శేషారెడ్డి ఐదవ బహుమతిగా పదివేల రూపాయలను, ఆయపాటి నారాయణ ఆరో బహుమతిగా 5000 రూపాయలను అందించనున్నారని నిర్వాహకులు వెల్లడించారు. ఉత్సవాలలో మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# సినిమా న్యూస్



# అదే బాధగా ఉంది.. ఫ్లాపులపై నోరు విప్పిన కృతి

తెలుగు చిత్రసీమలో ఉప్పెన సినిమాతో ఒక సంచలనంగా ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి, బేబమ్మ పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది. కెరీర్ ప్రారంభంలోనే అలాంటి బలమైన పాత్ర దక్కడం ఆమెకు వరుస అవకాశాల దారులు తెరిచింది. అయితే, ఆ తర్వాత వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోక పోవడం ఆమె ప్రయాణాన్ని కొంత మందగింపజేసింది. ఫలితం నా చేతిలో లేదు ఇప్పటివరకు తన ఫ్లాప్స్ గురించి ఎక్కువగా మాట్లాడని కృతి, తాజాగా మాత్రం తన మనసులోని భావాలను బయటపెట్టింది. తను నటించిన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయనే బాధ కంటే, బేబమ్మ లాంటి బలమైన పాత్రలు మళ్లీ దక్కకపోవడమే తనకు ఎక్కువగా బాధ కలిగిస్తోందని చెప్పిన మాటలు ఆమె నిజాయితీని, తన పని పట్ల ఉన్న కమిట్‌మెంట్‌ను ప్రతిబింబిస్తున్నాయి. పని చేయడం మాత్రమే నా చేతిలో ఉంది, ఫలితం నా చేతిలో ఉండదని కృతి ఈ విషయంలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. కెరీర్ పరంగా చూస్తే, ఉప్పెన తర్వాత కృతి చేసిన సినిమాల్లో పాత్రల బలం కొంత తగ్గిందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఆ పాత్రలు ప్రేక్షకులకు స్ట్రాంగ్‌గా కనెక్ట్ అవలేకపోయాయి. అదే కృతి కెరీర్‌లో ప్రధాన లోటుగా మారిందని చెప్పవచ్చు. ఇతర హీరోయిన్స్ తమ కెరీర్‌ను జాగ్రత్తగా మలుచుకుంటున్న తరుణంలో, కృతి గ్రాఫ్ మాత్రం ఊహించినంతగా పెరగలేదు. ఇలాంటి సమయంలో ఆమె తన ఆశలన్నింటినీ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్ర ప్రమోషన్స్ లోనే కృతి తన సినిమాల ఫ్లాపుల విషయంపై మాట్లాడగా, ప్రస్తుతం ఆ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సినిమా హిట్టైతే కృతికి కోలీవుడ్ లో మంచి ఛాన్సులొచ్చే అవకాశముంది. పైగా తెలుగులో కృతి, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాలో ఓ హీరోయిన్‌గా ఎంపికయ్యారు. అనిల్ సినిమా అంటే మినిమం గ్యారెంటీ అనే నమ్మకం ఆడియన్స్‌లో ఉండటంతో కృతి లైఫ్ కు ఈ ప్రాజెక్టు ఓ కీలక టర్నింగ్ పాయింట్ అవొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా చూసుకుంటే, కృతి శెట్టి కెరీర్‌లో కొన్ని మిస్ స్టెప్స్ ఉన్నప్పటికీ, ఆమె టాలెంట్, నిజాయితీ, మరియు తనపై ఉన్న నమ్మకం ఆమెను మళ్లీ సక్సెస్ దిశగా తీసుకెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బేబమ్మలా మరో బలమైన పాత్ర దొరికితే, ఆమె తిరిగి టాలీవుడ్‌లో తన స్థానం బలపరచడం ఖాయం అనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.



# ఇన్నాళ్లకు బయటపడ్డ ప్రియాంక చోప్రా బ్యూటీ సీక్రెట్.. అసలు విషయం చెప్పిన తల్లి!

మాజీ విశ్వసుందరి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం అభినయంతో ఎంతోమందిని ఆకట్టుకుంటూ నేడు ప్రపంచ స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న ఈ బ్యూటీ.. 43 సంవత్సరాల వయసులో కూడా అంతే అందంగా.. యవ్వనంగా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. మరి ఈ గ్లోబల్ స్టార్ బ్యూటీ సీక్రెట్ ఏంటి? అసలు ఇంత అందంగా ఉండడానికి ఆమె ఏం ఉపయోగిస్తుంది? అంటూ అభిమానులు సైతం తెలుసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.. మరి ప్రియాంక చోప్రా బ్యూటీ సీక్రెట్ ను ఆమె తల్లి మధు చోప్రా రివీల్ చేశారు. ప్రియాంక చోప్రా తల్లి డాక్టర్ మధు చోప్రా మాట్లాడుతూ..” నేను , నా కూతురు దశాబ్దాలుగా భారతదేశ చర్మ సంరక్షణలో భాగంగా అత్యంత ప్రావీణ్యం పొందిన శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ ను ఉపయోగిస్తాము. ఇది చాలా బాగా పనిచేస్తుంది. ముఖ్యంగా పసుపు , శనగపిండి , కొద్దిగా పాలను కలిపి ముఖానికి అప్లై చేసుకున్నట్లయితే ఈ ఫేస్ ప్యాక్ ముఖాన్ని శుభ్రపరుస్తుంది. చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది. అలాగే మొటిమలు , చర్మంపై ఉండే నలుపుదనం, నిర్జీవమైన ముఖం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి.. ముఖ్యంగా చర్మాన్ని తిరిగి రిపేర్ చేయడంలో ఈ ఫేస్ ప్యాక్ చాలా అద్భుతంగా పనిచేస్తుంది. నిత్యం కఠినమైన రసాయనాలు కలిగిన ఫేస్ క్రీమ్స్ వల్ల చర్మం ఎంతో ఇబ్బందికి గురవుతుంది. ఇక దాని నుంచి విముక్తి పొందాలి అంటే ఈ ఫేస్ ప్యాక్ చాలా చక్కగా ఉపయోగపడుతుంది అంటూ ప్రియాంక చోప్రా తల్లి చెప్పుకొచ్చింది. ఇకపోతే ఈ ఫేస్ ప్యాక్ ను ఎలా తయారు చేయాలి అనే విషయానికి వస్తే.. ముందుగా ఒక శుభ్రమైన గిన్నె తీసుకొని అందులో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండిని తీసుకోవాలి. ఇక ఇందులోకి ఇంట్లో తయారు చేసిన పాలమీగడను కొద్దిగా కలపాలి. అలాగే ఒక చెంచా తాజా పెరుగులో పావు చెంచా పసుపు, చల్లని పాలు వేసి కలపాలి. ఈ పదార్థాలు అన్నింటిని బాగా కలిపి ఈ పేస్టును వారానికి రెండుసార్లు ముఖానికి అప్లై చేయాలి.. ముఖ్యంగా కళ్ళ కింది భాగాన్ని వది లేసి.. ముఖానికి ఈ ఫేస్ ప్యాక్ అప్లై చేయాలి.. ఒక 15 నిమిషాల తర్వాత శుభ్రమైన నీటితో చర్మాన్ని కడి గేయాలి.. ఇలా చేయడం వల్ల అందమైన ముఖం మీ సొంతం అవుతుంది. ఇకపోతే పసుపు అన్ని చర్మాల వారికి సరిపోదు కాబట్టి వైద్యుల సలహా మేరకు ఇలాంటి ఫేస్ ప్యాక్స్ ఉపయోగించడం మంచిది. ప్రియాంక చోప్రా సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఈమె ప్రముఖ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో .. మహేష్ బాబు హీరోగా వస్తున్న వారణాసి సినిమాలోనటిస్తోంది.. ఇందులో మందాకిని అనే పవర్ఫుల్ పాత్ర పోషిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది.



# శోభితకు సినిమాలతో పని లేకుండా ఏడాదికి 10కోట్ల ఆదాయం?



తెలుగు తేజం శోభితా ధూళిపాళ్ల కేవలం నటిగానే కాకుండా.. గ్లోబల్ బ్రాండ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నారు. తనదైన స్టైల్ స్టేట్‌మెంట్ .. క్లాసీ లుక్స్‌తో అంతర్జాతీయ బ్రాండ్లను సైతం ఆకర్షిస్తూ తన పోర్ట్ ఫోలియో ని విస్తరించడం ఆసక్తిని కలిగిస్తోంది. తాజాగా శోభిత –నెక్సస్ న్యూయార్క్– వంటి ప్రతిష్టాత్మక హెయిర్ కేర్ బ్రాండ్‌తో కుదుర్చుకున్న వార్షిక ఒప్పందం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇటువంటి లగ్జరీ బ్రాండ్ల ప్రమోషన్ల ద్వారా శోభిత ఏడాదికి కోట్లాది రూపాయల వార్షికాదాయాన్ని ఆర్జిస్తోంది. ఒక్కో భారీ బ్రాండ్ యాన్యువల్ కాంట్రాక్ట్ విలువ కొన్ని కోట్ల రూపాయలలో ఉంటుందని సమాచారం. కేవలం నెక్సస్ మాత్రమే కాకుండా.. శోభిత ప్రస్తుతం ఫ్యాషన్, కాస్మెటిక్స్ , లైఫ్ స్టైల్ విభాగాలకు చెందిన సుమారు 5 నుండి 8 ప్రముఖ బ్రాండ్లకు ప్రమోషన్లు చేస్తోంది. ఒక్కో బ్రాండ్ ప్రమోషన్ కోసం లేదా ఫోటోషూట్ కోసం తన ప్రస్తుత క్రేజ్‌ను బట్టి 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు అంచనా. సోషల్ మీడియాలో శోభితకు ఉన్న –హాలీవుడ్ లెవల్ బ్యూటీ– అనే ఇమేజ్.. బ్రాండ్ విలువను పెంచడానికి కంపెనీలకు బాగా ప్లస్ అవుతోంది. దీంతో సినిమాల ద్వారా వచ్చే ఆదాయానికి సమానంగా బ్రాండ్ ప్రమోషన్ల ద్వారా సంపాదిస్తున్నారని సమాచారం. సినిమాల పారితోషికం విషయానికి వస్తే.. శోభిత కొన్నేళ్లలో కేవలం సహాయక పాత్రల స్థాయి నుండి లీడ్ రోల్స్ పోషించే స్థాయికి ఎదిగింది. –మేడ్ ఇన్ హెవెన్– సిరీస్.. –పొన్నియిన్ సెల్వన్– వంటి భారీ చిత్రాల తర్వాత తనకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఒక్కో సినిమాకు ఆమె 1.5 కోట్ల నుండి 2.5 కోట్ల రూపాయల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు తెలుస్తోంది. పాత్ర నిడివి .. ప్రాజెక్ట్ స్థాయిని బట్టి ఈ ధర మారుతుంటుంది. ముఖ్యంగా వెబ్ సిరీస్‌ల విషయంలో శోభిత పారితోషికం మరింత ఎక్కువగా ఉంటుందని టాక్. ఇక బ్రాండ్స్ ప్రమోషన్స్ తోనే శోభిత ఏడాదికి సుమారు 7 కోట్ల నుంచి 10 కోట్ల మధ్య ఆర్జిస్తున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. శోభిత నటించిన సినిమాల జాబితా పరిశీలిస్తే.. –రామన్ రాఘవ్ 2.0–తో ప్రయాణం మొదలుపెట్టి, గూఢచారి, మేజర్, –మంకీమ్యాన్– వంటి అంతర్జాతీయ స్థాయి చిత్రాలతో గుర్తింపు పొందింది. 2026–2027 కాలంలో తన ఖాతాలో మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి.



# ఒకే ఫ్రేమ్‌లో రణబీర్ వర్సెస్ రణ్‌వీర్: 'బ్రహ్మాస్త్ర 2' ప్యాకేజీ ప్లాన్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫాంటసీ అడ్వెంచర్ –బ్రహ్మాస్త్ర– సీక్వెల్‌కు సంబంధించి రణబీర్ కపూర్ తాజాగా అందించిన అప్‌డేట్స్ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి. నిజానికి బ్రహ్మాస్త్ర పార్ట్ 1 కి మిశ్రమ స్పందనలు వచ్చినా, పార్ట్ 2 పై ఆ ప్రభావం పడకూడదని దర్శకుడు అయాన్ ముఖర్జీ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం –బ్రహ్మాస్త్ర: పార్ట్ 2 – దేవ్– ప్రీ–ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయని.. దర్శకుడు అయాన్ ముఖర్జీతో కలిసి రణబీర్ అతి త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నారని తెలుస్తోంది. మొదటి భాగం ముగింపులో పరిచయం చేసిన అత్యంత శక్తివంతమైన –దేవ్– పాత్ర చుట్టూ ఈసీక్వెల్ కథ తిరుగుతుందని.. ఈ క్రమంలో సినిమా స్కేల్ మొదటి భాగం కంటే పది రెట్లు పెద్దదిగా ఉంటుందని రణబీర్ స్వయంగా వెల్లడించడం విశేషం. ఈ సీక్వెల్‌లో ఉత్కంఠ పెంచుతున్న అంశం ఒకటి ఉంది. అది –దేవ్– పాత్రలో ఎవరు కనిపిస్తారు అనేదే. బాలీవుడ్ అగ్ర హీరో రణవీర్ సింగ్ లేదా కన్నడ స్టార్ యశ్ పేర్లు ఈ పాత్ర కోసం ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ఒకవేళ రణవీర్ సింగ్ ఈ పాత్రను పోషిస్తే.. వెండితెరపై రణబీర్ కపూర్ వర్సెస్ రణవీర్ సింగ్ మధ్య జరిగే పోరాటం ప్రేక్షకులకు కనువిందుగా మారుతుంది. అయితే దీనిపై అధికారికంగా వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. మొదటి భాగం సాధించిన విజయం.. దేవ్ పాత్రపై ఉన్న సస్పెన్స్, ఈ సీక్వెల్‌పై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. మొదటి భాగం డైలాగ్స్ .. ఇతర అంశాలపై వచ్చిన విమర్శలను దృష్టిలో ఉంచుకుని.. ఈసారి అయాన్ ముఖర్జీ స్క్రిప్ట్ విషయంలో మరింత జాగ్రత్త వహిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా –అస్త్రవర్స్– అనే సినిమాటిక్ యూనివర్స్‌ను మరింత విస్తరించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కేవలం రెండో భాగమే కాకుండా.. మూడో భాగానికి సంబంధించిన ప్రణాళికలు కూడా ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్లు రణబీర్ హింట్ ఇచ్చారు. –యే జవానీ హై దీవానీ– వంటి సినిమాలకు సీక్వెల్స్ అవసరం లేదని చెప్పిన రణబీర్.. –బ్రహ్మాస్త్ర–ను మాత్రం ఒక గొప్ప ట్రయాలజీగా పూర్తి చేయడానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma